బస్తీల్లోని సమస్యలను పరిష్కరించండి



సమస్యలను అధికారులకు వివరిస్తున్న కార్పొరేటర్

హిమాయత్‌నగర్: బస్తీలు, కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ అధికారులకు సూచించారు. బుధవారం జీహెచ్‌ఎంసీ డీఎంసీ మారుతీదివాకర్, ఈఈ పేరు రాజ్, ఏఎంహెచ్‌ఓ హేమలత, ఏఈ సబిత, టౌన్ ప్లానింగ్ అధికారి వేణుగోపాల్, జలమండలి మేనేజర్ మహేందర్ రెడ్డిలతో కలిసి విట్టల్ వాడి, హరివిఆర్ కాలనీ, జైస్వాల్ బాడలతో పాటు పలు బస్తీలు, కాలనీలలో కార్పొరేటర్ పర్యటించారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్, మహేష్, సర్ఫరాజ్, తాజ్ ఖాన్, నదీమ్, అభిషేక్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ప్లేస్‌మెంట్ డ్రైవ్

బంజారాహిల్స్: ఫోర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో 2024 బ్యాచ్ విద్యార్థుల కోసం నిర్వహించిన బుధవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో యాక్సెంచర్, డెలాయిట్, ఈవై, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కేపీఎంజీ, ఇన్ఫోసిస్‌తో సహా విభిన్న రంగాలకు చెందిన ప్రసిద్ధ కంపెనీల ప్రతినిధులు ఇందులో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఫోర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ సుబీర్‌వర్మ మాట్లాడుతూ... 2024 బ్యాచ్ సాధించిన విజయాలపై సంతోషంగా ఉందన్నారు. ప్లేస్‌మెంట్ సీజన్‌లో తమ విద్యార్థులు చూపిన అత్యంత ప్రతిభ పట్ల ఎంతో గర్వంగా ఉందన్నారు. మంచి వేతనంతో కూడిన ప్యాకేజీని తమ విద్యార్థులు అందుకోగలిగారన్నారు.

సమీక్షలు లేక.. పనులు ముందుకుసాగక...

- ఎక్కడికక్కడ నిలిచిపోయిన అభివృద్ధి పనులు
- మొన్నటి దాకా ఎన్నికల కోడ్ పేరుతో కప్పదాట్లు
- మాయమవుతున్న పైపులు
- పట్టని ప్రజాప్రతినిధులు
- శాఖల మధ్య సమన్వయం కరువు



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇంటి వెనుక స్టోర్ చేసిన డ్రైనేజీ పైపులు

బంజారాహిల్స్: మొన్నటి దాకా ఎన్నికల కోడ్ పేరుతో జీహెచ్‌ఎంసీ, జలమండలి, ట్రాన్స్‌కో అధికారులు పనులు చేయకుండా చేతులెత్తేశారు. ఈ నెల 6న కోడ్ ఎత్తేశారు. అయితే 15 రోజులు గడుస్తున్నా ఇప్పటిదాకా పనుల్లో కదలిక కరువైంది.

- ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయి జనం పరేషాన్ అవుతున్నారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అక్టోబర్ నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తరువాత పనులు ముందుకుసాగుతాయనుకుంటే మార్చి నుంచి మళ్లీ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో 10 నెలల పాటు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ముఖ్యంగా జలమండలి చేపట్టాల్సిన డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లకు సంబంధించి రోడ్ల పక్కన కుప్పలుగా పైపులు భద్రపరిచారు.
- పనుల్లో జాప్యంతో ఈ పైపుల్లో చాలావరకు మాయమయ్యాయి. అధికారులంతా ఎన్నికల బిజీలో ఉండగా పనులు నిలిచిపోయి చాలాచోట్ల పైపులు పగిలిపోయి చోరీకి గురయ్యాయి. దీనికి తోడు జీహెచ్‌ఎంసీలో కాంట్రాక్టర్ల సమ్మె మరింత దెబ్బతీసింది. జీహెచ్‌ఎంసీ చేయాల్సిన వరదనీటి కాలువ పైప్‌లైన్ పనులు, సీసీ, బీటీ రోడ్లు ముందుకుసాగలేదు. దీంతో రోడ్లన్నీ గుంతలమయమై కాలనీలు, బస్తీలు అని తేడా లేకుండా అంతటా జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఫిలింనగర్ బస్తీల్లో కొట్టుకుపోయిన రోడ్డు

సమీక్షలు ఏవీ..?

వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఎన్నికల కోడ్ ముగియగానే అధికారులతో కలిసి సమస్యలు ఉన్న ప్రాంతాల్లో పర్యటించారు. ఇటీవలనే అభివృద్ధి పనుల తీరుతెన్నులపై సంబంధిత అధికారులతో తన డివిజన్‌కు సంబంధించి సమీక్షా సమావేశం కూడా ఏర్పాటు చేశారు.

- పనుల పురోగతిపై ఆరా తీసి సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని కోరారు. అయితే ఈ సమీక్షా సమావేశాలు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇంతవరకు ఏర్పాటు చేయకపోవడంతో పనుల్లో కదలిక లేకుండాపోయింది.
- నియోజకవర్గ పరిధిలో జలమండలి, జీహెచ్‌ఎంసీ చేయాల్సిన పనుల జాబితా, నిలిచిపోయిన అభివృద్ధి పనులు, విడుదలైన నిధులకు సంబంధించి ఆయన దగ్గర ఎలాంటి జాబితా లేకుండాపోయింది. సంబంధిత అధికారులు కూడా డివిజన్ల వారీగా ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు జరగాల్సి ఉందో వాటి వివరాలను ఎమ్మెల్యే తెప్పించుకోవాల్సి ఉంది.
- ఆ జాబితా కూడా లేకపోవడంతో ఎక్కడ ఏ పనులు జరుగుతున్నాయో ఎమ్మెల్యే దృష్టిలో లేకపోవడంతో తన నియోజకవర్గంలో అంతా బాగుందని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆరు డివిజన్లకు సంబంధించి జీహెచ్‌ఎంసీ, జలమండలి, శానిటేషన్, విద్యాశాఖ, ఆర్ అండ్ బీ, రెవెన్యూ, ట్రాన్స్‌కో తదితర ఇంజనీర్లు, అధికారులతో ఆయన నియోజకవర్గ సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే అభివృద్ధి పనులు గాడిన పడేలా కనిపించడం లేదు.
- సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించే అవకాశం కూడా కనిపిస్తుంది. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇంటి వెనుక వరద, డ్రైనేజీ ముంపును అరికట్టేందుకు సంబంధిత అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. భారీగా పైపులను కూడా తెచ్చిపెట్టారు. ఏడు నెలలు గడుస్తోన్నా ఆ పనులు ఇంకా మొదలుపెట్టలేదు. చాలా పైపులు పగిపోయాయి. కొన్ని ఎత్తుకుపోయారు. ఇలాంటి ఘటనలు నియోజకవర్గవ్యాప్తంగా ఎన్నో చోట్ల జరుగుతున్నాయి.
- ఇకనైనా ఎమ్మెల్యే స్పందించి నియోజకవర్గంలో పర్యటించి సమస్యలు తెలుసుకుని సమీక్షలు ఏర్పాటు చేసి పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పలువురు కార్పొరేటర్లు, ఎమ్మెల్యే అధికార కాంగ్రెస్ పార్టీలోనే ఉండటంతో పనులు సజావుగా సాగేందుకు అవకాశం ఉన్న విషయాన్ని వీరంతా గుర్తించలేకపోతున్నారు.

బస్తీ అభివృద్ధికి కృషి చేయాలి: దానం



కాలనీ అధ్యక్షుడు సహదేవ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దానం

ఫిలింనగర్: భగత్‌సింగ కాలనీ ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్షుడు సహదేవ్, బస్తీవాసులు బుధవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన అధ్యక్షుడిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ ఆధ్వర్యంలో బస్తీలో మరిన్ని అభివృద్ధి పనులు చేయించాలని ఏ అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బస్తీ సంక్షేమ సంఘం నాయకులతో పాటు సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డీసిల్టింగ్ పనుల పరిశీలన



బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–5లోని దేవరకొండ బస్తీ నాలాలో జరుగుతున్న డీసిల్టింగ్ పనులను బుధవారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పరిశీలించారు. స్థానిక హనుమాన్ దేవాలయంలో పెద్ద ఎత్తున బురద పేరుకుపోగా దగ్గరుండి సంబంధిత సిబ్బంది పర్యవేక్షించారు. బస్తీలోని మిగతా నాలాల్లో కూడా డీసిల్టింగ్ పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా నాలాలో పేరుకుపోయిన బురద, వ్యర్థాలు, చెత్తా చెదారం తొలగించి వరదనీరు సాఫీగా వెళ్లేందుకు కృషి చేయాలని డీఈ మణిపాల్, ఏఈ సతీష్‌లకు సూచించారు.

కుప్పలుగా పేరుకుపోతున్న 'గ్రీన్ వేస్ట్'



ఎమ్మెల్యే కాలనీలో ఓ ఇంటి ముందు పేరుకుపోయిన చెట్ల కొమ్మలు, వ్యర్థాలు

బంజారాహిల్స్: చెట్లకొమ్మలు తొలగించేవారు కరువై కాలనీలు, బస్తీలు అన్న తేడా లేకుండా ఎక్కడికక్కడ కుప్పలుగా పేరుకుపోతున్నాయి. ఒక వైపు విద్యుత్ అధికారులు కరెంటు వైర్లకు అడ్డుగా ఉన్నాయని కొమ్మలు కొట్టి వేస్తుండగా, మరో వైపు గాలి దుమారానికి పెద్ద ఎత్తున చెట్లు నేలకూలుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏర్పడిన గ్రీన్ వేస్టేజీను ఎప్పటికప్పుడు తొలగించలేకపోతుండటంతో పెద్ద ఎత్తున వ్యర్థాలు పోగవుతున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీలో గడిచిన నెల రోజులుగా ఎక్కడ చూసినా చెట్లకొమ్మలు పెద్ద ఎత్తున కనిపిస్తున్నాయి. వీటిని తొలగించాలంటూ కాలనీవాసులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా డీఆర్‌ఎఫ్ సిబ్బందికానీ, జీహెచ్‌ఎంసీ సిబ్బంది కానీ స్పందించడం లేదని వారు విమర్శిస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

శ్రీనగర్‌కాలనీ: మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సోమాజిగూడను స్వచ్ఛ సోమాజిగూడగా తీర్చిదిద్దుకోవడం మన బాధ్యత అని కాంగ్రెస్ నేత వనం శ్రీనివాసయాదవ్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిగూడలో అసుర్‌ఖానా వెనుకభాగంలో ఉన్న చెత్తను జీహెచ్‌ఎంసీ సిబ్బంది సహకారంతో తొలగించి బోర్డును ఏర్పాటుచేశారు. ఇక్కడ చెత్తను వేయరాదని, వేసినచో కఠిన జరిమానా ఉంటుందని హెచ్చరించారు. నిత్యం వేలాది మంది ప్రయాణించే దారిలో ఇలా ఖాళీగా ఉన్న స్థలం చెత్తవేయరాదని కోరారు. పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని, రోగాలను నివారించవచ్చన్నారు. నేతలు యాదయ్య, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే ఇంటికి మూడు నల్లా కనెక్షన్లు

అధికారులకు బీజేపీ నాయకుడి ఫిర్యాదు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ సంతోషగిరి బస్తీలో ఓ వ్యక్తి అక్రమంగా తన ఇంటికి మూడు మంచినీటి నల్లా కనెక్షన్ తీసుకున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక బీజేపీ నాయకుడు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న మేనేజర్ తవ్వించి చూడగా అసలు భాగోతం వెలుగులోకి వచ్చింది. వివరాలివీ... సంతోషగిరిలో ఓ వ్యక్తి గుట్టు చప్పుడు కాకుండా తన ఇంటికి ఒక దాని తరువాత ఒకటిగా మొత్తం మూడు కనెక్షన్లు తీసుకున్నాడు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు తంగలపెల్లి లక్ష్మణ్ వెంగళ్‌రావునగర్ సెక్షన్ జలమండలి మేనేజర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన సంతోషగిరికి చేరుకుని తవ్వించి చూడగా మూడు కనెక్షన్లు ఉన్న విషయం వెలుగుచూసింది. దీంతో సదరు వ్యక్తిపై చర్యలకు జలమండలి శాఖ అధికారులు సిద్ధమవున్నారు. అయితే నల్లా కనెక్షన్ తీసుకోవడం వెనుక జలమండలి కింది స్థాయి సిబ్బంది ప్రమేయం ఉందనే అనుమానం వ్యక్తం అవుతోంది.

బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీతో లకోటియా ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇరు కళాశాలల ప్రతినిధులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని లకోటియా కాలేజ్ ఆఫ్ డిజైన్ సత్యసాయి జిల్లాకు చెందిన బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం బంజారాహిల్స్‌లోని లకోటియా కాలేజ్‌లో జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మహ్మద్ అజర్, బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ కే నాగజ్యోతి ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఐదేళ్ల పాటు ఉండే ఒప్పందంలో భాగంగా లకోటియా కాలేజ్ విద్యార్థులకు మరింత నైపుణ్యావృద్ధి, మెళకువలు, శిక్షణను ఈ యూనివర్సిటీ అందిస్తుంది. ఈ ఒప్పందం తమకెంతో ఆనందంగా ఉందని ఈ సందరగా మహ్మద్ అజర్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కలువాయి అనిత, భానుప్రియ, అఫాన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

గుర్తుతెలియని వ్యక్తి మృతి



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఎదురుగా కేబీఆర్ పార్కును ఆనుకుని సులభ్ కాంప్లెక్స్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బంజారాహిల్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. 35–40 సంవత్సరాల మధ్య వయస్సున్న వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో తాము అక్కడకు చేరుకుని విచారణ చేపట్టామని, ఎలాంటి ఆచూకీ లభ్యం కాకపోవడంతో గుర్తుతెలియని మృతదేహం కింద కేసు నమోదు చేసి మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ కోన రమేష్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 87126 60459లో సంప్రదించాలని ఆయన కోరారు.

వివాహిత అదృశ్యం



రేవతమ్మ

హిమాయత్‌నగర్: ఓ ఇంటి వద్ద పని చేస్తున్న వివాహిత బయటకు వెళ్లి వస్తానని చెప్పి అదృశ్యమైన సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని ఉప్పుగూడ ప్రాంతానికి చెందిన నాగడి కాశయ్యకు రేవతమ్మ(34)తో 24 ఏళ్ల కింద పెళ్లయింది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాశయ్య మేస్త్రీ పని చేస్తుండగా, అతని భార్య కూడా ఆయనతో కలిసి పనిచేసేది. నెల రోజులుగా నారాయణగూడ వెంకటేశ్వర కాలనీలోని ఓ ఇంటి వద్ద వారు పని చేస్తున్నారు. మంగళవారం రేవతమ్మ బాత్‌రూమ్‌కు వెళ్తున్నా అని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కాశయ్య ఇంటికి వెళ్లిందేమో అనుకొని, ఇంటికి వెళ్లి చూశాడు. అక్కడ కూడా కనిపించకపోవడంతో బంధువుల ఇంటి దగ్గర ఆరా తీశారు. ఎంతకీ ఆమె ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాశయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి , దర్యాప్తు చేస్తున్నట్లు నారాయణగూడ పోలీసులు తెలిపారు.

డ్రైనేజీ సమస్యను త్వరలో పరిష్కరిస్తాం



శ్రీకృష్ణానగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న అజహరుద్దీన్

వెంగళరావునగర్: అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యను సాధ్యమైనంత త్వరలోనే పరిష్కరిస్తామని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజహరుద్దీన్ పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్ బి, సి బ్లాకులతో పాటుగా వెంకటగిరి తదితర ప్రాంతాల్లో ఆ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఫిరోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో అజహరుద్దీన్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను అజహరుద్దీన్ దృష్టికి తీసుకొచ్చారు. కాంగ్రెస్ నేతలు శాసనాల గాలయ్య, ఇ.ఎల్.రామయ్య, ఆదిల్, అబ్బు, రంజిత్‌రెడ్డి, నందకిశోర్, అలీఖాన్, ముక్రం, సలీం, రాధిక, లక్ష్మిరెడ్డి, అన్నపూర్ణ, హారిక, భవానీ, పిండిగిర్ని పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

ఫిలింనగర్: తెలంగాణ యోగా టీచర్స్ అలయన్స్ కమిటీ , సప్త రుషి యోగా గురూజీ వీరెల్లి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో మణిదీప పీఠాధిపతి సిద్ధ బాలయోగి స్వామిజీ ముఖ్య అతిథిగా హాజరై ప్రాచీన యోగా ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడు భోజరెడ్డి, ఖైరతాబాద్ నియోజకవర్గ కన్వీనర్ గడ్డం వెంకట్‌స్వామి, నాయకులు కొత్త నీరజ, ముద్దంగుల శ్రీనివాస్, బోయ రామాంజనేయులు, అనిల్‌కుమార్, రమ్య, గుమ్మకొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆధ్యాత్మికత ఎదుగుదల

సాక్షి, సిటీ బ్యూరో: ఆధ్యాత్మికంగా ఎదగడానికి యోగా ఒక మార్గమని అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ యోగా ప్రాక్టీషనర్ డాక్టర్ దీప్తి తర్లపల్లి తెలిపారు. శారీరక, మానసికంగా, భావోద్వేగపరంగా యోగాతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఇటీవల శారీరక దృఢత్వంతో పాటు ఒత్తిడి, ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ తగ్గించే సాధనంగా యోగా ఉపయోగపడుతోందని తెలిపారు. యోగా స్టూడియోలు, ఆన్‌లైన్ తరగతులు, యాప్‌ల ద్వారా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది యోగాను ప్రాక్టీస్ చేస్తున్నారని, ఇది మంచి పరిణామని వివరించారు.

పార్కుకు వచ్చిన జంటపై దాడి

వెంగళరావునగర్: ప్రశాంత వాతారణం కోసం పార్కుకు వచ్చిన జంటపై దుండగులు దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... బేగంపేటలో నివాసం ఉంటున్న వి.గోపి అతని స్నేహితురాలు సాహితి బుధవారం కృష్ణకాంత్ పార్క్‌కు వచ్చారు. ఈ క్రమంలో వారు కూర్చున్న ప్రాంతానికి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఎందుకు ఇక్కడ కూర్చున్నారంటూ బెదిరించారు. ఈమె ఓ మతం వర్గానికి చెందిన అమ్మాయి కదా, ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెడతామంటూ హెచ్చరించారు. మర్యాదగా రూ. 10 వేలు నుంచి రూ. 20 వేల వరకు ఇవ్వాలని అన్నారు. దాంతో గోపీ తన వద్ద డబ్బులు లేవని, తన బాబాయికి ఫోన్ చేస్తానని దాస్ అనే వ్యక్తికి ఫోన్ చేసి విషయాన్ని చెప్పాడు. అతను 100కు ఫోన్ చేసి వివరించాడు. ఈ సమయంలో గోపి అగంతకులను ఫొటో తీయగా వారు అతనిపై దాడి చేశారు. క్షతగాత్రుడు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేసుకున్న అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ పుట్టిన రోజు



జూబ్లీహిల్స్‌లో కేక్ కట్ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి



యూసుఫ్‌గూడలో అజహరుద్దీన్...

ఫిలింనగర్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు జూబ్లీహిల్స్ డివిజన్‌లో బుధవారం ఘనంగా జరిగాయి. ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి పాల్గొని కార్యకర్తలు, నేతలతో కలిసి కేక్ కట్‌చేశారు. రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, సీనియర్ నేతలు కాటూరి రమేష్, డీసీసీ జనరల్ సెక్రటరీ శ్యాం, మచ్చల విష్ణు, శ్రీనివాస్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డలో...

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డలో సికింద్రాబాద్ డీసీసీ మైనార్టీ ప్రెసిడెంట్ మోసిన్‌ఖురేషి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. నేతలు కృష్ణకుమార్, గంట మల్లేష్, ఖాజా, మహ్మద్ సర్దార్, దస్తగిరి, శ్రీను, జహంగీర్, శివ పాల్గొన్నారు. యూసుఫ్‌గూడలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో మాజీ ఎంపీ అజహరుద్దీన్ పాల్గొని కేక్ కట్ చేశారు. డివిజన్ ప్రెసిడెంట్ ఫిరోజ్‌ఖాన్, లక్ష్మణ్, కిషోర్, రంజిత్ రెడ్డి, అదిల్, అబ్బు, రామయ్య, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి



కీ॥శే॥ తలసాని శంకర్ యాదవ్ గారు

మోండా మార్కెట్ కూరగాయల వర్తక సంఘం అధ్యక్షులు

జననం: 08-03-1963 మరణం: 10-06-2024

“ఎందరో పేదవారికి అండగా నిలబడిన మీ సేవాభావం మాకు ఆదర్శనీయం
మోండా మార్కెట్‌కు ప్రెసిడెంట్‌గా మీరు అందించిన సేవలు చిరస్మరణీయం”

ఆ మహాత్ముడిని కోల్పోయిన వారి అమ్మగారు తలసాని లలిత భాయ్, సతీమణి విజయలక్ష్మి, కుమారుడు శివలాల్ యాదవ్, కోడలు రజిని, మనువడు సాలీష్ యాదవ్ (సాండీ) **సోదరుడు తలసాని శ్రీనివాస్ యాదవ్** (MLA) మరియు **తలసాని కుటుంబ సభ్యులందరికీ** మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారికి ఎల్లప్పుడూ బలమై నిలబడతామని తెలుపుకుంటూ, వారికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని కలిగించాలని కోరుకుంటూ .. బాధాతప్త హృదయాలతో

వియ్యంకుడు-వియ్యపురాలు: **వల్లాల చిన్న శ్రీశైలం యాదవ్ - కస్తూరి**
కూతురు - అల్లుడు: **వల్లాల వర్ష-నవీన్ యాదవ్**, మనువడు: **వల్లాల అన్ష్ యాదవ్**
కూతురు - అల్లుడు: **ఎర్రగుడ్ల వైశాలి యాదవ్-ప్రభాకర్ యాదవ్**
మనుమరాండ్లు: ఎర్రగుడ్ల నిత్య యాదవ్, శ్రీ యాదవ్, మనువడు: ఎర్రగుడ్ల క్రిష్ యాదవ్

వల్లాల వారి కుటుంబ సభ్యులు

వి.సత్యనారాయణ యాదవ్-విజయలక్ష్మి
వి.రమేష్ యాదవ్-వసంత
వి.లక్ష్మి యాదవ్
వి.ప్రవీణ్ యాదవ్ (వెంకట్)
వి.రిషి యాదవ్-ఐశ్వర్య యాదవ్
వి.మౌనిక యాదవ్, వి.శ్రావణి యాదవ్
వి.సౌందర్య యాదవ్, వి.మల్లిక యాదవ్
వి.వెన్నెల యాదవ్, వి.ఆరవ్ యాదవ్

జె.అశోక్ యాదవ్ - జయలక్ష్మి
ఎం.ఆంజనేయులు యాదవ్ - నాగలక్ష్మి
పి.గోవర్ధన్ యాదవ్ - రాజ్యలక్ష్మి
పి.మల్లేష్ యాదవ్ - ధనలక్ష్మి

బీసుపల్లి వారి కుటుంబసభ్యులు

బి.మల్లేశం యాదవ్-మంగమ్మ
బి.మహేష్ యాదవ్-ధనలక్ష్మి
బి.మహేందర్ యాదవ్-వనజ
బి.యాదగిరి యాదవ్-రాణి
బి.భాను చందర్ యాదవ్-నవిత
బి.నర్సింగ్ యాదవ్-సుధ
బి.శ్రీకాంత్ యాదవ్-పూజ
బి.రాజ్ మల్లేష్ యాదవ్-సువర్ణ
బి.విహాన్ యాదవ్, వి.ఈషాన్ యాదవ్
బి.వేద్ యాదవ్, బి.బృవన్ యాదవ్
బి.ఆద్విక్ యాదవ్

నక్కా వారి కుటుంబ సభ్యులు

ఎన్.ఉమేష్ యాదవ్-సావిత్రి
ఎన్.శ్రీనివాస్ యాదవ్-సుఖిన్య
ఎన్.రాహుల్ యాదవ్-శైలజ
ఎన్.రాహి యాదవ్
ఎన్.సాహస్ యాదవ్
ఎన్.స్వయం (రాఖీ) యాదవ్

కొల్లా అరవింద్ యాదవ్-నవనీత
బాతుక రవి యాదవ్-అనిత
గుర్రాల మధు యాదవ్-వాణి
మూసాపేట్ అరవింద్ యాదవ్-ప్రియాంక
పూచబోయిన అశోక్ యాదవ్-లత
యం.ప్రవీణ్ యాదవ్

పెద్దకర్మ: 20-06-2024,
గురువారం మధ్యాహ్నం 12:00 గం॥లకు

Lunch Follows

కార్యస్థలం: SVITఆడిటోరియం (మహబూబ్ కాలేజ్) ప్యాట్నీ సెంటర్, సికింద్రాబాద్ నందు పెద్దకర్మ జరుపబడును.

స్వర్గీయ తలసాని శంకర్ యాదవ్ గారు మీ తలపు లేని రోజు గడవదు మాకు. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరలని కోరుకుంటూ మీకు ఇవే మా ఘన నివాళులు